క్లుప్తంగా

ముగిసిన రెమీడియల్ క్లాసులు


కోసిగి కస్తూర్బాలో రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహించిన రెమిడియల్ క్లాసులు బుధవారం ముగిశాయి. ఆ పాఠశాలలో కోసిగి, మంత్రాలయం స్పెషల్ ఆఫీసర్లు పుష్పలత, కాంతి ఆధ్వర్యంలో మంత్రాలయం నుంచి 23 మంది, పెద్దకడబూరు 14, నందవరం 24, కోసిగి పాఠశాలలో 23 మంది బాలికలకు హాస్టల్ వసతితో పాటు రోజూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు క్లాసులు నిర్వహించారు. తరగతులు ముగించి ఆయా మండలలో పాఠశాలలకు పంపించారు. ఉపాధ్యాయినులు లక్ష్మీదేవి, దివ్యభారతి పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కోసిగి: మండలంలోని 19 సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు గురువారం నుంచి ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో జూన్ నెలకు సంబంధించి 7,183 మందికి గానూ రూ.1,99,90,500 నగదు మంజూరైనట్లు చెప్పారు. నేటి నుంచి 5వ తేదీలోపు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. అర్హత కలిగి ఉండి కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలైలో మంజూరు అవుతాయని పేర్కొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం


దాతలకు విరాళానికి సంబంధించిన బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి బుధవారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. సుంకేసుల (కర్నూల్) వాస్తవ్యులు సోమశేఖర్‌రెడ్డి తన కుమార్తెల పేరు మీదుగా రాజగోపు నిర్మాణానికి రూ.లక్ష దేవాలయ కార్యాలయంలో అందజేశారని చెప్పారు. అలాగే ఒక రోజు అన్నదానం కోసం రూ.75,000 విరాళంగా ఇచ్చినట్లు వివరించారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

కౌన్సిల్ మీట్..


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని టౌన్ : చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. సభ్యులు అజెండాలోని అంశాలను మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి చదివి సభ్యులకు వినిపించారు. దీంతో సభ్యులు అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రజా సమస్యలపై చర్చ జరపకుండానే అరగంటలోపే ముగించారు. సిరుగుప్ప చెక్‌పోస్టు సర్కిల్‌లో శ్రీ భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు కౌన్సిలర్లు ఆమోదించారు. 40వ వార్డు పరిధిలో శ్మశానవాటికలో ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయాలని చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్‌లకు కౌన్సిలర్ ఇందు వినతి పత్రం అందజేశారు. కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'సమతా సాహితీ సుమాలు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని హెచ్.మురవణి గ్రామ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 35వ పుస్తకం 'సమతా సాహితీ సుమాలు' బాల గేయాల సంకలనం బుధవారం విజయవాడలో అవిష్కరించారు. సోమన్న మాట్లాడుతూ సినీ హీరో ఘట్టమనేని కృష్ణ జయంతి సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ కళా పరిషత్ అధ్యక్షుడు జలాది మోహన్, ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ చేతుల మీదుగా విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సినీ అభిమానుల సమక్షంలో అవిష్కరించినట్లు చెప్పారు. అనంతరం సోమన్నను సత్కరించారు.

పది సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి

- ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు
- పదిలో తప్పిన వారికి ప్రత్యేక తరగతులు
- విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోకుండా చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- 34 కేంద్రాల్లో 7,826 మంది పరీక్షలు రాయనున్న విద్యార్థులు


ఆదోనిలో ఫెయిల్ అయిన పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్/ఆదోని సెంట్రల్ : విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోకుండా ఈ ఏడాది ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేంగా రెమిడియల్ తరగతులు నిర్వహించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించింది. ప్రత్యేక తరగతులు బుధవారం ముగిశాయి. ఈనెల 2వ తేదీ నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వారంతా ఈ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్‌లో ప్రవేశానికి అర్హత కల్పిస్తుంది.

డివిజన్ పరిధిలో..

డివిజన్ పరిధిలో 34 కేంద్రాల్లో 7,826 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. ఆదోని నియోజకవర్గంలో ఏడు కేంద్రాలు..ప్రభుత్వ బాలికల పాఠశాల, వైఎంకే ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్, అక్షరశ్రీ, నేషనల్, నారాయణ, మల్లికార్జున విద్యాలయ ఉన్నత పాఠశాలల్లో 1,500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ నెల 3న డివిజన్ పరిధిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 15,589 మందిలో 15,295 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. అందులో 8,652 మంది ఉత్తీర్ణులయ్యారు.6937 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వారికి సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు విద్యాశాఖ నిర్వహిస్తోంది.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేంతవరకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు గానూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫలితాలు వచ్చిన వెంటనే ప్రతిరోజూ సబ్జెక్టులు, పీరియడ్‌ల వారీగా టైంటేబుల్ తయారు చేశారు. సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన వారి జాబితాను తయారు చేసి వారిని చైతన్యపరిచి తరగతులకు హాజరయ్యేలా చేశారు. ఉపాధ్యాయులు గణితం, సైన్స్ వంటి సబ్జెక్టుల విషయంపై ప్రత్యేక దృష్టి సారించి రోజూ నమూనా పరీక్షలు నిర్వహించడంతో పాటు గత పబ్లిక్ పరీక్షల ముఖ్యమైన ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలకు ఎలా సమాధానాలు రాయాలో తర్ఫీదునిచ్చారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు రెమీడియల్ తరగతులు నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్లకు చేరిన ప్రశ్నపత్రాలు..

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు బుధవారం పోలీస్ స్టేషన్‌లకు చేరగా పరీక్షల అధికారులు వాటిని సరిచూసుకొని స్టేషన్లలో భద్రపరిచారు. పరీక్ష రోజు ఆయా కేంద్రాలకు తీసుకెళ్లి అందజేస్తారు. ఇక పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదని ప్రభుత్వం ఆదేశించింది. అలాగేఎల్రక్టానిక్ పరికరాలను అనుమితించరు.

అన్ని మండలాలకు ప్రశ్నాపత్రాలు చేరాయి



17 మండలాలకు సంబంధించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు హెడ్‌క్వార్టర్ పోలీస్‌స్టేషన్‌లకు చేరాయి. పరీక్షల్లో 400 మంది ఇన్విజిలేటర్లు, 70 మంది చీఫ్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశాం. పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. జిరాక్స్ సెంటర్లను మూసి వేస్తున్నాం.

– సుకుమార్, డిప్యూటీ ఈఓ

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలు


పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న పరీక్షల అధికారులు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాలలో ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు ఆయా పరీక్షల చీఫ్ శోభ రాణి, లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ప్రశ్నాపత్రాలను కోసిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా పోలీసుల సమక్షంలో భద్రపరిచారు. వారు మాట్లాడుతూ 10వ తరగతి ఫెయిల్ అయినా విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలలో 300 మంది, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు 9గంటల లోపు పరీక్ష కేంద్రం చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఆయా పాఠశాల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా రామాంజనేయ రెడ్డి, సిద్దప్పను నియమించారు.

విత్తనాలకు నమోదు చేసుకోండి


ఆర్లబండ ఆర్బీకేలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

కోసిగి: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుచేసే రైతులు ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి రాజు తెలిపారు. బుధవారం మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌లు ఆన్‌లైన్‌లో విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 320 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారని, రైతులకు 40 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. పిల్లిపెసర విత్తనాలు, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పొలం పాసుపుస్తకం , ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని సంబధిత రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. ఒక ఎకరా ఉన్న రైతులకు ఒక బస్తా, 5 ఎకరాల లోపు రైతులకు 3 బస్తాలు చొప్పున ఇవ్వనున్నట్లు వివరించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

పెద్దకడబూరు : రైతులను ముంచడానికి నకిలీ విత్తనాల అమ్మకాలు మొదలయ్యాయని వాటిని అరికట్టి రైతులను కాపాడాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెయిన్ బో ప్రైవేట్ పాఠశాలలో బుదవారం రైతు సంఘం తాలూకా కార్యదర్శి మబ్బు అంజినేయ అధ్యక్షతన కౌలు రైతు సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తొలకరి వర్షాలు పడుతున్న తరుణంలో జిల్లాలో నకిలీ విత్తనాల అమ్మకాలు జోరందుకున్నాయన్నారు. సంబంధిత అధికారులు నకిలీ విత్తనాలపై ప్రత్యే దృష్టి సారించాలన్నారు. అలాగే కౌలు రైతులకు భూయాజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భాస్కర్‌యాదవ్, వీరేష్, తిక్కన్న, హనుమంతు, వీరేష్, గోపాల్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి

ఆదోని రూరల్ : మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తు చేసుకోండి

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు చొప్పున 160 సీట్లు ఉన్నాయని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: పశ్చిమప్రాంత సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ కోరారు. బుదువారం ఆర్ట్స్ కళాశాల అవరణలో నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతంలో వేదవతి, హంద్రీనీవా, తుంగబద్ర, ఆర్డీఎస్ కుడి కాలువలు ఉన్నా ప్రజలకు సరిగా ఉపయోగపడటం లేదని, దీంతో బతుకుదెరువు కోసం వలసలు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. పత్తికొండలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. సంఘం సహాయ కార్యదర్శి అఫ్రీద్ జిల్లా కార్యదర్శి బాలు, డివిజన్ నాయకులు వంశీ, రాజు, ఉదయ్, కిరణ్, రాజేస్, రామంజి పాల్గొన్నారు.

రుణం మంజూరు చేయాలి


పెద్దతుంబళం ఏపీజీబీ ఎదుట ధర్నా చేస్తున్న పొదుపు మహిళలు

ఆదోని రూరల్ : అప్పు చెల్లించినప్పటికీ ఏపీజీబీ వారు రుణం మంజూరు చేయడంలేదని, వెంటనే రుణం మంజూరు చేయాలని పాండవగల్లు గ్రామచైతన్య గ్రూపు పొదుపు మహిళలు బుధవారం పెద్దతుంబళం ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం పొదుపు అప్పు చెల్లించినప్పటికీ నేటికీ రుణం ఇవ్వడం లేదన్నారు. బ్యాంకు మేనేజర్ స్పందించి రుణం మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. రైతుసంఘం నాయకురాలు ఫాతిమాబీ, సర్పంచ్ ఉమాదేవి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు


పదవీ విరమణ చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఎం.రామచంద్రను బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు.ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరుగా,సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ వైస్ చైర్మెన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎస్‌సీఆర్ఎంయూ చైర్మెన్ నరసింహులు, వర్కింగ్ చైర్మెన్ సిద్దారెడ్డి, సెక్రటరీ ఎస్ వెంకటేశ్వర్లు డివిజనల్ నాయకులు సుదర్శన్‌రాజు, విజయ్ కుమార్, మానిక్‌రాజు,ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు పీఠాధిపతి ఆశీస్సులు


కేసీఆర్‌ను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో బుధవారం తెలంగాణ బ్రహ్మణ సంక్షేమ సదన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి వచ్చిన సీఎం కేసీఆర్‌కు పీఠాధిపతి శ్రీ రాఘవేంద్ర స్వామి మెమొంటో, శేషవస్త్రం,ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

మాట నిలబెట్టుకున్న నేత జగనన్న


హొళగుందలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: దేశంలో ఏ ఒక్కరూ చేయని విధంగా ఇచ్చిన హామిలన్నీ నెరవేర్చి, మాట నిలబెట్టుకున్న నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగ బుధవారం హొళగుందలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర చరిత్రలో ఏ నేత అమలు చేయని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోక వెంకటేష్ నిర్వహిస్తున్న ఉలిగమ్మ దేవర కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు షఫివుల్లా, వీరేశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కుమారస్వామి, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, కోగిలతోట శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 1,152 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యా న్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాచారం మేర కు బుధవారం తెల్లవారు జామున4 గంటలకు ఆలూరులోని కస్తూర్బా0 పాఠశాల సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. మొలగవల్లి గ్రామానికి చెందిన గోవిందు, నరసింహులు స్కూటర్లపై అక్రమంగా తరలిస్తున్న 12 బాక్సుల కర్ణాటక మద్యం (1,152 ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్) స్వాధీనం చేసుకుని స్కూటర్‌లను సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఆలూరు ఎస్ఐ డాక్టర్ నాయక్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ సొమ్ము చోరీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని ది పంజరాపోల్ సమీపంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో హుండీలోనున్న సొమ్మును బుధవారం చోరీ చేశారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆలయం ద్వారం, హుండీని పగలగొట్టి 13 తులాల వెండి వస్తువులు, రూ.6 వేలు నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లినట్లు చెప్పారు. బుధవారం ఉదయం యదావిధిగా పూజారి తలుపులు తెరుస్తుండగా తాళాలు పగిలిపోయి ఉండడాన్ని గుర్తించి సమాచారమివ్వడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మెలగాలి

ఆస్పరి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలిగితే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో సర్పంచ్ తోయజాక్షప్ప అధ్యక్షతన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ ప్రచార కార్యక్రమాలు శుక్రవారం వరకు కొనసాగుతాయన్నారు. చివరి రోజు కుంకుమార్చన, గోపూజతో ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణుగోపాల్, క్రిష్టారెడ్డి, చంద్రారెడ్డి, రామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యాకానుక' పంపిణీకి చర్యలు

- ఇప్పటికే మండలాలకు చేరుకున్న విద్యా సామగ్రి
- పాఠశాలల వారీగా కిట్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది
- 12వ తేదీన విద్యార్థులకు అందజేస్తామని చెబుతున్న అధికారులు


జగనన్న విద్యాకానుక కిట్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: పేద విద్యార్థులు ఆర్థికపరమైన ఇబ్బందులతో పాఠశాలలకు దూరం కాకుడదని, ప్రతి విద్యార్థి చదువుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న విద్యాకానుకలో అన్ని రకాల విద్యా సామగ్రిని సమకూర్చి వాటిని అయా మండల కేంద్రాలకు తరలించారు. పాఠశాలలు తెరిచే రోజే విద్యార్థులకు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిద్ధంగా కిట్లు..


ఆదోని నియోజకవర్గంలో విద్యాకానుక కిట్లను అయా పాఠశాలలకు చేరవేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాలను మాత్రమే ఇచ్చేవారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు స్కూలు బ్యాగు, షూస్, సాక్స్, నోట్ పుస్తకాలు, బెల్టు వంటి వాటితో పాటు ఫాక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, పిక్చర్ డిక్షనరీలను 'జగనన్న విద్యాకానుక కిట్' పేరుతో అందిస్తున్నారు. 2023–2024 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు సరిపడ కిట్లను మండల వనరుల కేంద్రాలకు చేరాయి. ఈనెల 10వ తేదీ నాటికి వాటిని అయా పాఠశాలలకు తరలించడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. తరగతుల వారీగా ఏ పాఠశాలకు ఎన్ని పంపించాలో విద్యార్థుల సంఖ్యను బట్టి కిట్లును సిద్ధం చేస్తున్నారు.

కిట్‌లో ఉండేవి.. (ప్రత్యేక బాక్స్ వేసుకోండి)

మూడు జతలు యూనిఫాం, రెండు జతల సాక్స్, మూడు సెట్లు నోట్ పుస్తకాలు, (ఒక సెట్‌లో 6 పుస్తకాలు), ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్ ఉంటాయి.

- ఆదోని నియోజకవర్గంలో 130 పాఠశాలలు ఉన్నాయి అందులో ప్రాథమిక పాఠశాలలు 89, ప్రాథమికోన్నత పాఠశాలలు 22, ఉన్నత పాఠశాలలు 19 ఉన్నాయి. 1– 10 తరగతి వరకు 31,952 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. యూనిఫామ్స్‌తో పాటు టెక్స్‌ట్‌బుక్స్ 1,94,341, బ్యాగ్స్, షూస్ అన్ని వచ్చాయి.
- కోసిగి మండలంలో 47 పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 32, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. 15,481 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి కూడా బ్యాగ్స్, షూస్, 15,481 పుస్తకాలు వచ్చాయి.
- మంత్రాలయం మండలంలో 48 పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 31, ప్రాథమికోన్నత పాఠశాలలు 8, ఉన్నత పాఠశాలలు 9 ఉన్నాయి. దాదపు 11,014 మంది విద్యార్థులు ఉన్నారు. 68,105 పుస్తకాలతో పాటు బ్యాగులు, షూలు వంటివి అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

పంపిణీకి సిద్ధం చేస్తున్నాం



జగనన్న విద్యాకానుక కిట్లు మండలానికి చేరుకున్నాయి. ఏఏ పాఠశాలలో ఎంతమంది ఉన్నారో చూసుకొని వాటి ప్రకారం పాఠశాలలకు చేరవేసేందుకు కిట్లను సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 10వ తేదీలోపు అన్ని పాఠశాలలకు కానుకలను చేరవేస్తాం. 12వ తేదీన పాఠశాలలు తెరచే రోజు అందరికీ విద్యకానుకలు అందేంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బి. శివరాములు, ఎంఈఓ, ఆదోని

బాలిక అదృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన కె.నాగవేణి (14) అనే బాలిక అదృశ్యమైందని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో ట్యాబ్లెట్లు తెచ్చుకుంటానని మెడికల్ షాపుకు వెళ్లిందని, తిరిగా రాలేదని, గ్రామంలో, చుట్టుపక్కల, బంధువులను విచారించి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి హనుమంతరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆదోని అర్బన్ : పట్టణంలోని వైపీఆర్ కాలనీకి చెందిన జోగేందర్‌ను ఆస్పరి రోడ్డులో ఆటో ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బైకుపై వస్తుండగా ఆటో ఢీకొట్టడంతో కింద పడ్డానని, స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడు తెలిపారు.

యువతి ఆత్మహత్య


సంధ్య

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సంధ్య (16) కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపిన వివరాలు.. హొస్పేటకు చెందిన వెంకటేశ్వర్లు, సుజాత దంపతుల కుమార్తె సంధ్య (16) ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌లో అమ్మమ్మ వారి ఇంట్లో తల్లి, కూతురు ఉన్నారు. కొన్ని రోజులుగా సంధ్య కడుపునొప్పితో బాధపడుతుండేదని, ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్

ఆదోని అర్బన్ : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులపాటు సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు బుధవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు పనులు వదులుకొని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వస్తే సర్వర్ డౌన్ ఉందని సిబ్బంది తెలిపారని ప్రజలు పేర్కొన్నారు. రెండు రోజులుగా తిరుగుతున్నా సాంకేతిక సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నారని వారు చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామ శివారులోనున్న ఏపీ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వివరాలను పరిశీలించిన తర్వాత ఓసీ,బీసీ,ఈడబ్ల్యూసీ రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 రుసుము చెల్లించాలని సూచించారు. 10వ తరగతి ఫలితాల ఆధారంగా ప్రవేశానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కౌతాళం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్ శివకుమార్ తెలిపారు. డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరెషన్ 16వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మండలానికి చెందిన వారిని జిల్లా ఉపాధ్యక్షుడిగా అలాగే రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి ప్రభన్న మాట్లాడుతూ మండలానికి చెందిన వారికి జిల్లా, రాష్ట్ర పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు అహ్మద్, సోమిరెడ్డి, సిద్దప్ప, రమేష్, మంజుల, నారాయణరెడ్డి, మధుకిరణ్, మురళి, ఖాజా పాల్గొన్నారు.